డబ్బుకొండకింద కులమతాల గరికపరకలు....

# క్లాస్‌లెస్ మామయ్య



## కాకాని చక్రపాణి

''ఏం చేస్తున్నారే? ఏవిటా మట్టి చేతుల నిండా? గుడ్డలుకూడా పాడు చేసుకున్నారు. మట్టిలో ఆడొద్దని ఎన్ని సార్లు చెప్పింది అమ్మ. బుద్ధిలేకపోతేసరి'' అని కసిరింది అక్కకూత రు హిమని విమల.

''మట్టిలో ఆడటంలేదు పిన్నీ. మట్టితో బొమ్మలు చేయమంది మా టీచర్. రేపు చూపెట్టాలి. మేం చేసిన బొమ్మలెలా ఉన్నాయో చెప్పు, బాగా చేశామా?'' అంది హిమ ముఖం మీద పడ్తున్న జుట్టును మోచేత్తో పైకి తోసుకుంటూ. ఆమెకు పన్నండేళ్ళుంటాయి. ఏవిమిదో క్లాసు చదువుతోంది. ఆమె చుట్టూ ఆమె క్లాసుమేట్స్ ఉన్నారు. అందరి చేతులూ మట్టి పులుముకుని ఉన్నాయి. తాము చేసిన మోడల్స్‌కి ఫైనల్ టచెస్ ఇస్తున్నారు వాళ్ళు.

ఆ పిల్లలు చేస్తున్న బొమ్మలు చూసిన విమలకు ఆశ్చర్యమయింది. అంతలో గేటు తెరుచుకుని వచ్చిన సుధాకర్‌తో అంది ఆమె. 'చూశావా అన్నయ్యా! వీళ్ళు చేసిన బొమ్మలు. ఈ చర్చి కట్టింది మేరీ, మసీదు ఇక్బాలున్నీసాది. పూజారి వరదాచార్యులుగారి కూతురు వరలక్ష్మి గుడికట్టింది. ఇండస్ట్రియలిస్ట్ గంగాధరరావుగారి కూతురు సుభాషిణి కట్టింది అయిదంతస్థుల భవనం. సుజాతవా

ళ్ళ నాన్నడాక్టరుకదా, అది హాస్పిటల్ కట్టింది. మన హిమ కట్టింది చిన్న ఇల్లు, సమాజంలోని క్లాస్, క్రీడ్, కాస్ట్ కాన్షస్ నెస్ పిల్లల మీద కూడా చాలా అజ్ఞాతంగా ప్రభావం చూపు తోందో చూశావా?''

''ఏం బావుండలేదా పిన్నీ మా బొమ్మలు ?'' అడిగింది హిమ.

''బావుండకేం బావున్నాయి'' అంది విమల

''ఈ చిన్న వయసుకే మీకు కులాల మతాల విషయమెందుకే. పడగొట్టెయ్యండా గుడినీ, మసీదునీ, చర్చినీ, స్కూళ్ళు కట్టండి, హాస్పిటల్లు, రైల్వే స్టేషన్లు, ఫ్యాక్టరీలు కట్టండి'' అన్నాడు సుధాకర్.

''ఏం మసీదుకడ్తే తప్పా?'' అడిగింది ఇక్బాలున్నీసా

''తప్పా తప్పున్నరా. పుట్టినప్పుడు కులం, మతం ఉందా మనకు'' కులం, మతం మనం ఏర్పరచుకున్నవే. పిల్లలు మీరూ ఇలాంటి భావాలు వంటబట్టించుకోవటం బాగాలేదు'' అన్నాడు సుధాకర్.

''పుట్టినప్పుడే ఉంటుంది కదండీ. హిమే మా ఇంట్లో పుట్టి ఉంటే రెడ్డి అయ్యేది కదా? నేనే ఏ ముస్లిముల ఇంట్లో పుట్టి ఉంటేనో...'' అంటోంది సుజాత.

''ఓసి తెలివి తక్కువ పిల్లా! ఎవరు ఏ కొంపలో పుట్టినా మునిగిపోయేదేం లేదు. మనమంతా మానవజాతి. అంతే తప్ప ఈ కులాలు, మతాలు— అన్నీ మనం కల్పించుకున్నవే. వృత్తి ధర్మాలననుసరించి మన పెద్దలు వర్ణాలేర్పరిచారు. వృత్తులు అంతరించి, వర్ణాలు కులాలయ్యాయి. మీరంతా చక్కగా చదువుకుని వీటిని కూకటివేళ్ళతో పెళ్ళగించాలి'' అన్నాడు సుధాకర్ ఆవేశంగా.

ఇలా సుధాకర్ ఇంకో ఉపన్యాసం ఇచ్చేవాడేకానీ, 'ఒరేయ్ సుధా! పిల్లలతో నీకెందుకు గానీ, లోపలకురా అత్తయ్యా, లతా వచ్చారు'' అని అతని అక్క సరస్వతి పిలవటంతో సుధాకర్‌కి పిల్లల్ని వదిలేసి లోపలికి వెళ్ళక తప్పలేదు. విమల అన్నను అనుసరించింది.

''అమ్మయ్య! తుఫాను వదిలింది. ఇహ కానివ్వండే. మా కాస్ట్‌లెస్ మామయ్య ఎప్పుడూ అంతే, పెద్ద పెద్ద ఉపన్యాసాలిస్తుంటాడు'' అంది హిమ స్నేహితురాళ్ళతో.

సుధాకర్ లోపలికి వెళ్తూనే పలకరించింది మేనత్త మాణిక్యమ్మ, ''ఏవయ్యా సుధాకర్, ఊళ్ళోనే ఉన్నావా?'' అని.

''ఊళ్ళోలేక ఊటీపోయానా అత్తయ్యా !? అంటూ సోఫాలో కూర్చున్నాడు అతను.

''ఇంతకీ విషయమేమిటో? పనిబడితేగాని రావు నువ్వు'' అడిగాడు సుధాకర్

''లతకు ఏమయినా సంబంధం చూడాలి. సరస్వతికీ, నీకూ చెబ్దామని వచ్చాను. చదువు కూడా అయిపోయిందా. పెళ్ళి చేసి దానింటికి దాన్ని పంపిస్తే నాకు నిశ్చింత'' అంది మాణిక్యమ్మ.

''ఏం లతా! ఎలాంటి వరుదు కావాలి? ఆరడుగుల అందగాడా?'' నవ్వాడు సుధాకర్ లత సిగ్గుపడి తలవొంచుకుంది.

''ఆ అందం కొరుక్కుతింటామా! అదేం కాదు గానీ, కులం, గోత్రం, వంశం, సంప్రదాయం, ఆస్తిలేకపోయినా నికరమయిన ఉద్యోగముంటే చాలు'' అంది మాణిక్యమ్మ.

''ఇదిగో అత్తయ్యా! కులం ప్రసక్తితేకు, నాకు మహా చిరాకు'' అన్నాడు సుధాకర్.

''నువ్వు సంబంధాలు చూడకపోయినా ఫర్లేదుగానీ, కులం కానివాడు మాకక్కర్లేదు బాబూ! తెలిసీ, తెలిసీ నిన్నడగటమే నాది బుద్ధితక్కువ'' అంది ఆమె నిష్ఠూరంగా.

''మనది ఇంటర్‌కాస్ట్ మారేజని, ఇహ అంతా అలా చేస్కోవాలటండీ'' అంది సునంద.

''నేనొప్పుకోను. అందరూ ఇలా అంటే దేశం బాగుపడదు. 'మంచియన్నది మాలయైతే, మాలనేనగుదున్' అన్నాడు గురజాడ''.

''బలవంతాన ఎవరినెత్తినా మన అభిప్రాయాలు రుద్దటం మంచిది కాదు. సమాజంలో మార్పు క్రమంగా రావాలి. ఒక్కసారిగా రాదు'' అంది సరస్వతి.

''కులం సంబంధాలు నావల్లకాదు అత్తయ్యా! అక్కనో, బావనో అడుగు'' అంటూ లేచి వెళ్ళిపోయాడు సుధాకర్.

కులతత్వం పట్ల ద్వేషం సుధాకర్ కొన్ని విచిత్ర పరిస్థితుల్లో అలవర్చుకున్నాడు. సునంద కూడా అతను పని చేసే ఆఫీసులోనే పనిచేసేది. పరిచయం ప్రణయంలోకి దారితీసింది. ఇద్దరూ కలిసి సినిమాలకూ, షికార్లకూ తిరిగారు. వాళ్ళిద్దరి మధ్యా ఎప్పుడూ కులం ప్రసక్తిరాలేదు. ఆమె మాట్లాడే, ప్రవర్తించే తీరును బట్టి ఆమె తమ కులానికే చెందినది అనుకున్నాడతను. పెళ్ళి ప్రస్తావన తీసుకు వచ్చినప్పుడు—

''మీ వాళ్ళు ఒప్పుకుంటారా మన పెళ్ళికి?'' అని అడిగింది సునంద.

''ఏం ఎందుకు ఒప్పుకోరు?''

''మన కులం ఒకటి కాదు గనుక''

''ఏ కులం మీది?''

చెప్పింది ఆమె. అతదు నిర్విణ్ణుడైపోయి, ఓ క్షణం ఏం మాట్లాడలేకపోయాడు.

''మనకులం ఒకటి కాదని తెలిసే నాతో స్నేహం చేశావా?'' అడిగాడతను తేరుకుని.

''నాకభ్యంతరంలేదు''

''మీ వాళ్ళకి''

''వాళ్ళకున్నా నేను లెక్కచేయను''

''కాని మా వాళ్ళు ఒప్పుకున్నా నేను ఈ పెళ్ళికి అంగీకరించను. కులం, మతం మనం తయారు చేసినవి కావు. పూర్వులు బాగా ఆలోచించి మనకేది మంచిదో నిర్దేశించి ఆదేశించారు. ఆ ఋషులకంటే మనకెక్కువ తెలియదు. తెలియక స్నేహం చేశాను. క్షమించు...'' అని లేచి వెళ్ళిపోయాడతను.

అలా ఆమె నుండి విడివడ్డాడుకాని ఆమెని మర్చిపోలేకపోయాడు సుధాకర్. ఆఫీసులో ఆమె వంక చూడటం మానేసినా ఆమె రూపం, మాటలు, స్వభావం అతన్ని వెంటాడటం మానలేదు. ఆమె స్నేహం మానేసినప్పటి నుండి ఆమె భావన మరింత ఉధృతంగా అతన్ని కల్లోలితపరచసాగింది. మనోవ్యధతో తిండి సరిగ్గా తినటం మానేశాడు. మనిషి చిక్కిపోయాడు. ఆఫీసు కెళ్తే ఆమె కనపడుతుందేమోనని సెలవు పెట్టసాగాడు.

అదీ!



మాస్టారు అడిగాడు గోపిని.

''స్వయం కృషి అంటే ఏమిటి?''

''మా హోంవర్క్‌ని మేమే చేసుకోవడం సార్!'' జవాబిచ్చాడు గడుగ్గాయి.

మహర్షి(కొత్తగూడెం)

తల్లీ తండ్రీ పోయింతరువాత అన్నీ తానే అయి పెంచిన సరస్వతి అది చూడలేకపోయింది. ఓ రోజు తీరిగ్గా ప్రశ్నలు వేసి అతన్నుండి సమాచారం రాబట్టింది ఆమె.

"ఆ పిల్లని పెళ్ళి చేసుకో" అని సలహా ఇచ్చింది.

"నువ్వే ఇలా అంటావా అక్కా! ఆమెది మనకులం కాదు" అన్నాడతను.

"మనదేకులమో చెప్పు? మనకులానికి నిర్దేశించిన వృత్తినేమనంఅవలంభిస్తున్నామా? ప్రతి యుగం, సమాజం తనక్కావాల్సిన నియమనిబంధనల్ని తయారు చేసుకుంటాయి. ఇవి ఏవీ పరమ సత్యాలూ, శాశ్వతాలూ కావు. అవసరానికి తగిన మార్పులు, చేర్పులు చేసుకోని సమాజం... తాత, తండ్రుల్లా ఆలోచించే మనుషులున్న సమాజం పతనోన్ముఖమవుతుంది, నశిస్తుంది".

"నువ్వేమయినా చెప్పు అక్కా! నేనీ పెళ్ళి చేసుకోను" అన్నాడు సుధాకర్ మొండిగా.

సరస్వతి అంతటితో ఉర్కోలేదు. అతడి దీనవదనాన్ని ఆమె చూడలేకపోయింది. వీలయినప్పుడల్లా అతని మనస్సు మార్చ ప్రయత్నించి. ఓ రోజు—

"మన హిమకు పెళ్ళి చేసేస్తే నా బాధ్యత తీరిపోతుంది" అంది సరస్వతి.

"అదేంమాట, దానికింకా పన్నండేళ్ళు కూడాలేవు. అప్పుడే ఏం పెళ్ళి. పైగా విమల పెళ్ళికాకుండానే" అన్నాడతను.

"'అష్టవర్షాభవేత్ కన్యా' అన్నారు మనవాళ్ళు. పైగా బాల్య వివాహాలు మంచివన్నారు"

"అది మూఢనమ్మకం. ఆడపిల్లకు పెళ్ళంటే ఏమిటో తెలియని వయసులో పెళ్ళి చేయటం దుర్మార్గం.'

"అంటే సమాజం ఒకప్పుడేర్పరిచిన నిబంధన— ముస్లిములదారుల్లో పెళ్ళయిన ఆడపిల్లలజోలికి వాళ్ళు పోకపోవటం వల్ల వచ్చిన నిబంధన ఆ కాలంలో సరైందే అని ఆ సమాజం నమ్మింది. మరి ఈ సమాజానికీ, కాలానికీ తగినట్టు మనమూ మారాలి కదా!"

"నిజమే"

"మరి సునందను పెళ్ళి చేసుకో"

సుధాకర్ మౌనం వహించాడు.

సరస్వతి అంతటితో ఊర్కోలేదు.

ఉపయోగం



"మీరు రాసిన వెయ్యి పేజీల నవల రైలు ప్రయాణంలో ఉపయోగకరంగా ఉంటుంది".

"నిజంగానా?"

"అవును. పడుకోవడానికి చక్కని తల దిరిడుగా ఉపయోగపడుతుంది".

సునందను ఇంటికి ఆహ్వానించింది. ఆమెను వేరుగా, వేరే కులందిగాచూడలేదు. ఇంటికొచ్చిన ఆమెతో మాట్లాడక తప్పలేదు సుధాకర్‌కు. క్రమక్రమంగా అక్కమాటల్లోని నిజం అతనికి అవగతమయింది. సరస్వతి వాళ్ళకి పెళ్ళి చేసి వాళ్ళని తన ఇంట్లోనే ఉంచుకుంది. సునంద కాపురానికొచ్చినప్పటి నుండి అతనిలో ఏ మూలోవున్న సందేహాలన్నీ పటాపంచలయ్యాయి. ఆమె ప్రేమ, ప్రవర్తన కలివిడి తత్వంతో ఆమె తనకోసమే పుట్టినట్టుగా భావించసాగాడతను. ఆ తరువాత అతనికి కులం పేరెత్తితేనే మంటగా తయారయింది. ఒక ఎక్స్ట్రీం నుండి మరో ఎక్స్ట్రీంకి మారిపోయాడతను.

ఎవరయినా కులం పేరెత్తితే చాలు వాగ్యుద్ధానికి తయారయేవాడు. ఓసారి అతని మిత్రుడు శంకర్‌తో—

"నీకు తెలిసిన బ్రాహ్మణ కుర్రాడెవరైనా ఉంటే చెప్పరా సుధా! ఓ హోటల్లో సర్వర్ ఖాళీలున్నాయి" అన్నాడు శంకర్.

"ఉద్యోగానికి కులంతో ఏం పని?" అన్నాడు సుధాకర్.

"కులమేకదా ముఖ్యం. అదో వెజిటేరియన్ హోటల్"

"అయితేనేం? నాన్ బ్రాహ్మిన్స్‌లో వెజిటేరియన్స్ లేరా?"

"అబ్బా! ఈ తర్కాలెందుగ్గానీ, ఆ హోటల్ ప్రొప్రైటర్ నా స్నేహితుడు. ప్యూర్ బ్రాహ్మిన్. అతడికి కులం పట్టింపులు జాస్తి. అస్సలు నన్ను కూడా మొదట బ్రాహ్మినే అనుకున్నాట్ట, లేకుంటే స్నేహమే చేసేవాడు కాదేమో" నవ్వుతూ అన్నాడు శంకర్.

"ఇదేం నవ్వుకో తగ్గ విషయం కాదు. అలాంటి వాడు నీ స్నేహితుడని చెప్పుకోటానికి సిగ్గేయటంలా?" అన్నాడు వ్యంగ్యంగా సుధాకర్.

"టేకిట్ ఈజీ, ఎందుకంత ఉద్రేకం? అందరూ నీలానే ఉంటారా?"

"ఊహూ. నేనేదైనా భరించగలను కానీ, కులం పేరెత్తితే మాత్రం సహించలేను కులమతాల ఊసెత్తాడంటేనే చెప్పొచ్చువాడెంత అజ్ఞానో. జీవజాలమంతట్లోకీ, మానవుడిదే మహోన్నత దశ. అటువంటిది జంతువుల్లో, పశుపక్ష్యాదుల్లో, క్రిమికీటకాల్లో కూడా లేని జాతిమత భేదాలు మానవుల్లోనే కన్పించటం శోచనీయం" ఆవేశంగా అన్నాడు సుధాకర్.

"ఈ అరుపుల వల్ల ఒక్క రోజులో మార్పురాదురా, క్రమంగా వస్తుంది. అందాకా ఓపిక పట్టాలి తప్పదు. ఈ హోటల్ సంగతి సరే, ఎక్కడ కులాభిమానం కన్పించటంలేదు, ఇవాళారేపూ? క్రిస్టియన్ స్కూళ్ళలో క్రిస్టియన్స్‌ని తప్ప తీసుకోరు. తీసుకున్నా ఆ ట్రీట్‌మెంట్ వేరుగా ఉంటుంది. ముస్లింలూ అంతే. ఇక మన హిందువులున్నారంటే మరీ అధ్వాన్నం— దీనిలో ఉన్నన్ని చీలికలు బ్రాప్పే... కుల మత ప్రాబల్యం బాగా పెరిగిపోయింది. నిజమే. గొంతులు చించుకున్నందువల్ల ప్రయోజనం లేదు. దీనికి రూట్‌కాజేమిటో ఆలోచించాలి. దోపిడీ వర్గం ఆక్టోపస్ సాచిన టెంటకిల్స్ ఇవి. ఆర్థిక పరమైన కారణాలే మూలం. సమాజంలో ఆ మార్పు తీసుకురావాలి. కడుపులో ఉన్న అల్సరుకి పైన ఆయింట్‌మెంట్ రాస్తే ప్రయోజనం లేదు".

"నువ్వొట్టి కమ్యూనిస్టువి. నీతో మాట్లాడి ప్రయోజనం లేదు" అని వెళ్ళిపోయాడు సుధాకర్.

సుధాకర్ మాటల మనిషికాదు. 'కుల నిర్మూలన సంఘా'లు స్థాపించాడు. ఇతోధిక సేవ చేస్తున్నాడు. అలాంటి అతని దగ్గర శరత్ ప్రస్తావన కోపం తెప్పించటంలో ఆశ్చర్యంలేదు.

ఆరోజు పొద్దున్నే పేపరు చదువుతున్న సుధాకర్ ఎవరో వచ్చినట్లనిపిస్తే తలెత్తి చూశాడు.

ఆ యువకుడు వస్తూనే ఉపోద్ఘాతంలేకుండా మాట్లాడసాగాడు.

"నమస్కారం, మీరే సుధాకర్ అనుకుంటా. నా పేరు శరత్ 'సంగీతా ఎలక్ట్రానిక్స్'లో ఇంజనీరుగా పనిచేస్తున్నాను. మీ చెల్లెలు విమలా, నేను ప్రేమించుకున్నాం. మీరంగీకరిస్తే, పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం..."

"విమల మీకెలా తెలుసు?" అడిగాడు సుధాకర్ శరత్ మాటల్ని మధ్యలో తుంచేస్తూ

"మా చెల్లెలు నీలిమ, ఆమె క్లాస్‌మేట్స్. అప్పుడప్పుడు ఆమె మా ఇంటికొస్తుండేది. అలా పరిచయమైంది"

"మీ పెద్దల్తో చెప్పారా మరి?"

"లేదు, మొదట మిమ్మల్ని కనుక్కొనే వెళ్దామనుకున్నాను"

"మీ వాళ్ళు ఒప్పుకోకపోతే?"

"కాదనరు, అన్నా వెనకాడను"

"బావుంది. మీ నాన్నగారేం చేస్తారు?"

"టెలిఫోన్స్‌లోచేసి రిటైరయ్యారు"


"సరే నేనొచ్చి మాట్లాడతాను లెండి"

అని "విమలా! కాస్త కాఫీ తీసుకురా" అని కేకపెట్టాడు సుధాకర్.

"ఇప్పుడంత సమయంలేదండీ, ఏమనుకోవద్దు, నేవెళ్తాను" అని జేబులోంచి పెన్ను, పాకెట్ సైజు లెటర్‌పాడ్ తీసి, తండ్రిపేరు, ఇంటి ఫోన్‌నెంబరు రాసి "వచ్చేముందుగా ఇన్‌ఫాం చేస్తే నాన్న తప్పక ఇంట్లో ఉంటారు" అంటూ కాయితం చింపి ఇచ్చి వెళ్ళిపోయాడు శరత్.

"ఎవర్రా వచ్చింది?" అంటూ లోపలి నుండి వచ్చింది సరస్వతి.

## గేదె



రవణారావు భార్యతో "ఏమిటేవ్ మన వాడికి గేదెనెక్కి సవారీ చేయాలని ఉందట!" అన్నాడు రెండేళ్ల మనవడిని ఆడిస్తూ.

భార్య: "మరయితే ఆలస్యం దేనికి? వాడ్ని వీపు మీదెక్కించుకుని వాడి సరదా తీర్చండి" అంది వెటకారంగా.

—భోగ శ్రీనివాసమూర్తి

"ఎవరో శరత్ అట" అంటూ అతనిచ్చిన కాయితాన్ని చూస్తూనే సుధాకర్ కనుబొమలు ముడిపడ్డాయి. 'ధర్మానందశర్మ, 67117' అని రాసుంది. 'ఛా, బుద్ధిలేకపోతే సరి' అన్నాడు సుధాకర్ ఆ కాయితాన్ని ఉండచుట్టి గదిమూలకు విసిరేస్తూ.

"ఏవిట్రా అది?" అడిగింది సరస్వతి.

"ఎవడో ధర్మానందశర్మ కొడుకుట, మన విమలని ప్రేమించాట్ట, పెళ్ళి చేసుకుంటాడట"

"నువ్వేమన్నావు?"

"ఏమీ అనలేదుకానీ, ఈ పెళ్ళి జరగదు"

'ఏం?'

"ఏం ఏమిటి? ఇన్నాళ్ళూ కులభేదం లేదు అని చెప్పి, కులనిర్మూలనకోసం కృషి చేస్తూ, చివరికి చెల్లెల్ని మనకులం వాడికే ఇచ్చి పెళ్ళిచేస్తే చూసేవాళ్ళేమనుకుంటారు? చెప్పటమే తప్ప చేయటంశూన్యం అనుకోరా?"

"బావుందిరా తమ్ముడూ నీ ఆదర్శం. వాళ్ళిద్దరూ ఒకర్నొకరు ఇష్టపడి, ఏ తొందరబాటు పనీ చేయక, పెద్దలమని మనకి పెత్తనమిస్తే, నీ ఆదర్శం కోసం దాని గొంతుకోస్తావా? అయినా నీకు కులమతాల పట్టింపులేనిదెక్కడ? హిరణ్యకశిపుడు శత్రువని చెప్తూనే విష్ణుమూర్తి నామం జపించందే తోచనట్లు నువ్వూ అస్తమానం వాటిని తలుస్తున్నావు తప్ప మరిచిందెక్కడ?"

కాఫీ కప్పుతో వచ్చిన విమల, అక్కడ శరత్ లేకపోతే, అన్న తమ పెళ్ళికి వ్యతిరేకించటం చూసి ఖిన్నవదనయై గుమ్మం దగ్గరే నిలబడిపోయింది. బావ మూర్తికూడా ఆ సంభాషణ వింటూ ఆమె పక్క నిలబడ్డాడు.

"నా ఆదర్శాన్నే అనుమానిస్తున్నావా అక్కయ్యా! నేను మరీ చులకనయిపోయాను" అన్నాడు సుధాకర్.

"చులకన కాదురా సుధా! అర్థం చేసుకో... నిజంగా నువ్వు కులమతాలకి అతీతుడివే అయితే నువ్వు పుట్టిన కులం సంగతి ఎందుకు మర్చిపోవు? అన్నీ సమానమనుకునేవాడికి వాళ్ళదీ, మనదీ ఒకటైనా కాకపోయినా ఒకటే కాదా?" అంది సరస్వతి.

"అవునయ్యా సుధాకర్! హేట్రెడ్ ఆఫ్ ఈవిల్ అటాచెస్ యు టు ఈవిల్. దేన్నయినా ప్రేమించే వాడితో బాటు, ద్వేషించేవాడు కూడా దానితో బంధాన్ని పెంచుకున్నవాడే. దాని ఉనికినే మరిచిపోయినవాడు నిజంగా ఉన్నతుడు" అన్నాడు బావ మూర్తి.

గేటు తలుపు తీసి హడావుడిగా పరిగెత్తుకుంటూ వచ్చింది హిమ. ఆమె చేతుల్లో చిన్నకుక్కపిల్ల ఉంది. చూడటానికి ముద్దుగా ఉంది అది. "మేరీ ఇచ్చిందీ బుజ్జిముండని. దీన్ని మనం పెంచుకుందామా కాస్ట్‌లెస్ మామయ్యా! నువ్వేం భయపడకు. దీనికి కాస్ట్‌లేదు." అంది ఆమె కుక్కపిల్లను సుధాకర్‌కు చూపెడ్తూ.

"అలాగే. పిన్ని పెళ్ళికి కానుకగా ఇద్దాందీన్ని" అన్నాడు సుధాకర్ కుక్కపిల్లను ఒళ్ళోకి తీసుకుంటూ.

